క్లుప్తంగా

వర్షం కోసం ప్రత్యేక పూజలు


పైరయ్య ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

పెద్దకడబూరు : మండల పరిధిలోని బసలదొడ్డి గ్రామంలో వెలసిన పైరయ్య ఆంజనేయస్వామికి ధర్మకర్త బుడ్డా మన్మధుడు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు శనివారం వర్షం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు నర్సిరెడ్డి, శివరాములు, బాలయ్య, హరికృష్ణారెడ్డి, లంకారెడ్డి, జయ్యప్ప, హనుమయ్య, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిని తరిమికొడదాం


మాట్లాడుతున్న బాబురాజు

ఆదోని టౌన్: ప్రజల పాలిటశాపంగా మారిన క్షయవ్యాధిని తరిమికొడదామని టీబీ యూనిట్ సూపర్‌వైజర్లు బాబురాజు, లలితమ్మ, వార్డు అడ్మిన్ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని 33వ వార్డు సచివాలయంలో క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ పౌష్టికాహారం, వైద్యులు సూచించిన మందులు క్రమం తప్పకుండా వాడితే వ్యాధి నయమవుతుందని చెప్పారు.

తవ్వారు..వదిలేశారు


పెద్దతుంబళంలో రోడ్డు పక్కన గుంతలు పూడ్చని దృశ్యం

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో ఓ ప్రైవేట్ కంపెనీ కేబుల్ కనెక్షన్ కోసం జేసీబీతో ప్రధాన రోడ్డు పక్కన గుంత తవ్వి వదిలేశారు. దాదాపు వారం రోజులు కావొస్తున్నప్పటికీ పూడ్చి వేయకపోవడంతో ఆ గుంతలో శనివారం గ్రామానికి చెందిన మౌలాసాబ్ అనే రైతుకు చెందిన ఎద్దు ప్రమాదవశాత్తు గుంతలో పడి గాయాలపాలైంది. రైతు స్థానికుల సహాయంతో గుంతలో నుంచి ఎద్దును అష్టకష్టాల మీద బయటకు తీశారు. తక్షణమే గుంతను పూడ్చివేసేలా ఆర్‌అండ్‌బీ అధికారులు కంపెనీ, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు


పడిపోయిన విద్యుత్ స్తంభాలు మారుస్తున్న విద్యుత్ అధికారులు

కోసిగి: మండలంలో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన గాలి వానలకు 22 విద్యుత్ స్తంభాలు కూలాయి. ఈ మేరకు శనివారం విద్యుత్ అధికారులు యుద్ధప్రాతిపదిక వాటి స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. యథావిధిగా పొలాలకు విద్యుత్ సరఫరాను కొనసాగించారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. వ్యవసాయ బోర్లు, మోటార్ల వద్ద జాగ్రత్తలు తీసుకుని విద్యుత్‌ను వినియోగించుకోవాలని ట్రాన్స్ కో ఏఈ వీరేష్ సూచించారు.

ఆంజనేయస్వామికి అభిషేక పూజలు

కౌతాళం: మండలలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం భక్తులు పూజలు నిర్వహించారు. మండల కేంద్రం కౌతాళంతో పాటు అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజినేయ స్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

21న ఆంజనేయస్వామికి విశేష పూజలు

ఆదోని అర్బన్: ఈనెల 21వ తేదీన మంగళవారం స్వాతినక్షత్రం శ్రీ నృసింహ జయంతి సందర్భంగా మంగరాయ ఆంజనేయస్వామి సన్నిధిలో లక్ష్మీనరసింహస్వామి, మంగరాయ ఆంజనేయస్వామి వార్లకు విశేష పజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ వాసుదేవరావు శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. మంగళవారం ఉదయం స్వామివార్లకు తేనాభిషేకం, ఫల, పంచామృతాభిషేకం తదితర పూజలు జరిపిస్తామని చెప్పారు.

మతసామరస్యానికి ప్రతీక ఖాదర్‌లింగస్వామి


- నేటి నుంచి ఉరుసు ఉత్సవాలు
- రేపు గంధోత్సవం
- ముస్తాబైన స్వామివారి దర్గా
- దేశనలుమూలల నుంచి రానున్న భక్తులు

కౌతాళం: మతసామరస్యానికి ప్రతీకగా పేరొందిన శ్రీజగద్గురు ఖాదర్‌లింగ స్వామి ఉరుసు ఆదివారం భక్తిశ్రద్ధ మధ్య ప్రారంభం కానుంది. మండల కేంద్రమైన కౌతాళంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి 320వ ఉరుసు వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాటు పూర్తి చేశారు. ఈ మేరకు దర్గా ముస్తాబైంది. శ్రీజగద్గురు మహాపురుష సయ్యద్-షా-ఖాదర్‌లింగస్వామిగా కొనియాడబడుతున్నారు. అయితే ఈప్రాంతంలో ఖాదర్‌లింగ, లింగ్‌బంద్, జగద్గురు ఖాదర్‌లింగస్వామి, ఖాదర్‌వలిగా పేరుగాంచారు. 19న ఆదివారం సమాధిని సుగంధ పానీయాలతో శుద్ధి చేస్తారు. సోమవారం గంధం, మంగళవారం ఉరుసు, బుధవారం సఫ్‌రా (ప్రసాదం పంపిణీ), గురువారం జియారత్ వేడుకలు ఉంటాయని దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా ఉసేని చిష్తీ తెలిపారు.

స్వామివారి చరిత్ర

చరాచర జీవకోటి రాశులకే మూల సూత్రమైన పరమేశ్వరుడినే మెప్పించిన ఓ ముస్లిం మహనీయుడు ఖాదర్‌లింగ స్వామి అని చరిత్ర చెబుతుంది. పూర్వం కర్ణాటక రాష్ట్రంలోని బిజాపూర్ పట్టణంలో కొలవైన అమీనూద్దీన్ అలిఆలా షేర్ ఏ ఖుదా వద్ద ఖాదర్‌లింగ స్వామి 12సంవత్సరాలు శిష్యరికం చేశారు. గురువు ఆజ్ఞానుసారం మానవుల్లో మత మౌఢ్యాన్ని తొలగించి మతసామరస్యాన్ని చాటేందుకు కర్ణాటక సరిహద్దులో ఉన్న కౌతాళానికి వచ్చారు. ఈయన లింగాన్ని ధరించడాన్ని ఈప్రాంతంలో ఉన్న శైవమతస్థులు కొందరు అభ్యంతరం చెప్పారు. భగవంతుడు ఎవరి సొంతం కాదని, పరమేశ్వరుని ప్రతీక అయిన లింగంపై ఎవరికి హక్కు లేదని ఆయన వారితో వాదించారు. శైవమతస్థులను సమావేశపరిచి వారిలో మెడలో ఉన్న లింగాలను బావిలో వేసి వాటిని మరలా రప్పించి తన భక్తిని చాటుతానని ఖాదర్‌లింగస్వామి స్పష్టం చేశారు. తాను అలా చేయని పక్షంలో గ్రామం వదలి వెళ్తానని, చేసిన పక్షంలో తానున్న స్థలాన్ని శాశ్వతంగా ఉండడానికి అంగీకరించాలని కోరడంతో శైవమస్తులు సైతం సమ్మతించారు. ఈ మేరకు బావిలో వేసిన శివలింగాలను బయటకు రప్పించారు. దీంతో ఆశ్చర్యానికి గురైన గ్రామస్తులు ఖాదర్‌లింగ స్వామిగా పూజించడం ప్రారంభించారు. ఆయనకు ముగ్గురు భార్యలు, ఐదు మంది కుమారులు ఉన్నారు. 320 సంవత్సరాల క్రితం ఆయన గ్రామస్తులు ఇచ్చిన స్థలంలోనే సమాధి అయ్యారు. ఆయన వంశస్థులు అయిన ప్రస్తుత ధర్మకర్త సయ్యద్ మున్నపాషా ఉసేని చిష్తీ ట్రస్టీగా ఉన్నారు.


ఖాదర్‌లింగ స్వామి దర్గా


విద్యుత్ అలంకరణలో ఖాదర్‌లింగస్వామి దర్గా


దర్గా ప్రధాన ముఖద్వారం


దర్గా ముఖద్వారం

ఉరుసు ఉత్సవాలకు తరలిరానున్న భక్తులు



ఖాదర్‌లింగస్వామి ఉరుసు ఉత్సవాలకు దేశ నలుమూలల నుంచి భక్తులు తరలిరానున్నారు. మధ్యప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఢిల్లీ, జమ్ముకాశ్మీర్ తదిర ప్రాంతాలతోపాటు విదేశాల నుంచి సైతం భక్తులు వస్తారని దర్గా ధర్మకర్త మున్నపాషా తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. బెంగళూరు, హైదరాబాదుకు చెందిన కళాకారులతో ఖవ్వాలీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉత్సవాలు విజయవంతంగా పూర్తి చేసేందుకు అధికారులతోపాటు ప్రజలు సహకారం అందించాలని ఆయన కోరారు.

–ధర్మకర్త సయ్యద్ మున్నపాషా ఉసేని చిష్తీ

రూ. కోటితో దర్గా అభివృద్ధి

దర్గాను సుమారు కోటి రూపాయలతో అభివద్ధి పనులు పూర్తి చేసినట్లు ధర్మకర్త మున్నపాషా తెలిపారు. భక్తుల సహకారంతో దర్గాలో సకల వసతులు సమకూర్చామన్నారు. రూ. 45లక్షలతో 60అడుగుల గోపురం ఏర్పాటు చేశామన్నారు. అదే విధంగా బొంబాయికి చెందిన భక్తులు 30లక్షలు అందజేయడంతో దర్గా ఆవరణ చుట్టూ పాలికార్బొనేట్ షీట్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. దర్గా ముందు భాగంలో మహాద్వారాన్ని రూ.40లక్షలతో గంగవతి భక్తులు ఇచ్చిన సహకారంతో పూర్తి చేసినట్లు తెలిపారు. ఆదోనికి చెందిన భక్తుడు రూ. లక్షాతో రెండు ధ్వారాలను అమర్చారన్నారు. మరో కర్ణాటక భక్తుడు ఇచ్చిన సహకారంతో దర్గాలో బండాపరుపు పనులు కూడా పూర్తి చేశామన్నారు. భక్తుల సహకారంతో ఆవరణలో మజీద్ నిర్మాణం పూర్తి చేసి ఇటీవలే ప్రారంభించినట్లు తెలిపారు. దర్గా గోపురం 60అడుగులతో ఎంతో సుందరంగా ఏర్పాటు చేశామన్నారు. లోపలి భాగంలో నూతనంగా గ్లాస్ ఫిట్టింగ్‌తో వివిధ రంగులతో ప్రత్యేక హాదిసు ఆయాత్‌లు (ఉర్దూలో) గ్లాసుల్లో అమర్చారు. ఈపనులను రూ. 25లక్షలతో హుబ్లీకి చెందిన భక్తులు పూర్తి చేశారని ధర్మకర్త తెలిపారు.


60అడుగుల దర్గా గోపురం


దర్గాలో నిర్మించిన ఉత్తర ద్వారం


నూతనంగా నిర్మించిన మసీదు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోని అర్బన్: పట్టణంలోని ఇండోర్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతులు ఉండడం వల్ల ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఈ పురుషోత్తం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆర్టీసీ కాలనీ, ఎస్‌కేడీ కాలనీ, నారాయణగుంత, ఎంఎం కాలనీ, హవన్నపేట, కార్వన్‌పేట, కోర్టు ప్రాంగణం, ప్రభుత్వ స్త్రీ, చిన్నపిల్లల ఆసుపత్రి ప్రాంతం, ఏరియా ఆసుపత్రి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉద్యోగాల కోసం డబ్బులిచ్చి మోసపోవద్దు

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసే వారిని నమ్మి నిరుద్యోగులు, విద్యావంతులు మోసపోవద్దని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీలో ఎలాంటి ఉద్యోగ ఖాళీలు లేవన్నారు. అయితే కొందరు వ్యక్తులు మాయ మాటలు చెప్పి మున్సిపాలిటీలో ఉద్యోగాలిప్పిస్తామని నమ్మించి డబ్బు వసూలు చేస్తున్నట్లు తెలిసిందన్నారు. మున్సిపాలిటీలో ఎలాంటి ఉద్యోగ నియామకాలు చేపట్టడం లేదని పేర్కొన్నారు.

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోనా వేంకటేశ్వర స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలతో పాటు వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికిస్థానికులతో పాటు సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకూర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో వీరబ్రహ్మేంద్ర స్వామి దంపతులు


వీరంపల్లిలో విద్యుత్ దీపాల అలంకరణలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం

గోనెగండ్ల: స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామి వారి ఆరాధనోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకం, కుంకుమర్చన, మహా మంగళహారతి పూజలు చేపట్టారు. అనంతరం గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవంకనులపండువగాజరిపించారు.

వీరంపల్లిలో వేడుకలు..

మండలంలోని వీరంపల్లి గ్రామంలో శనివారం వీరబ్రహ్మేంద్రస్వామి 28వ ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం గ్రామోత్సవం, అనంతరం స్వామివారి కల్యాణం, సాయంత్రం రథోత్సవ కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో చేపట్టారు. ఆదివారం తిరునాల సందర్భంగా పరుగు పందెం, బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. బండలాగుడు పోటీల్లో గెలుపొందిన ఎద్దుల యజమానులకు వరుసగా రూ.20,016, రూ.15,016, రూ.10,016 నగదును బహుకరిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త సంజీవయ్యస్వామి తెలిపారు.

ఘనంగా వాసవీమాత జయంతి వేడుకలు


కలశాలతో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు


ప్రత్యేక అలంకరణలో వాసవీమాత


సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

ఆదోని అర్బన్: పట్టణంలో ఆర్యవైశ్య సంఘం, మహిళా మండలి సంఘం ఆధ్వర్యంలో శనివారం వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక నగరేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకీలో కొలువుంచి ప్రధాన రహదారుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో 108 కలశాలతో మహిళలు, చిన్నారులు ఊరేగింపు నగరేశ్వరస్వామి ఆలయం చేరుకున్నారు. అనంతరం ఆలయంలో సామూహిక సంకల్పం, కుంకుమార్చన తదితర పూజలు జరిపించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష కార్యదర్శులు ప్రకాష్, వేణుగోపాల్, సభ్యులు సుబ్రహ్మణ్యం, రాంప్రసాద్, సూర్యమనోహర్, మహిళా మండలి అధ్యక్ష కార్యదర్శులు సరస్వతి, త్రివేణి, పుష్పలత పాల్గొన్నారు.

సిలబస్‌లో లేని ప్రశ్నలతో విద్యార్థుల అగచాట్లు


సిలబస్‌లో లేని ప్రశ్నల స్థానంలో చేతితో రాసి ఇచ్చిన ప్రశ్న పత్రం

ఆదోని సెంట్రల్: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ రెండవ సెమిష్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 75 మంది, జ్యోతిర్మయి డిగ్రీ కళాశాలలో 48 మంది, సాయి డిగ్రీ కళాశాలలో 65 మంది విద్యార్థులు పరీక్షలను రాస్తున్నారు. శనివారం డిగ్రీ మొదటి ఏడాది హిందీ పరీక్ష రాసిన విద్యార్థులు ప్రశ్నపత్రం చూసి ఖంగుతిన్నారు. 20సి2104 కోడ్ ప్రశ్న పత్రంలో సిలబస్‌లో లేని ప్రశ్నలు ఉండటంతో ఇన్విజిలెటర్ల దృష్టికి తీసుకెళ్లారు. వారు వర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి సూచనలతో 23సి 2104 కోడ్ ప్రశ్నపత్రాన్ని ఆయా కేంద్రాలకు మెయిల్ ద్వారా పంపగా వారు డౌన్‌లోడ్ చేసుకుని జిరాక్స్ సెంటర్లకు పరిగెతి జిరాక్స్ తెచ్చి విద్యార్థులకు అందజేసేలోపు దాదారు గంట ఆలస్యమైనట్లు విద్యార్థులు వాపోయారు. కాగా రెండో సారి ఇచ్చిన ప్రశ్నపత్రంలోనూ పుస్తకంలో లేని ప్రశ్నలు ఇవ్వడంతో వాటి స్థానంలో చేతితో రాసి ఇచ్చారు. ప్రశ్నపత్రం ఆలస్యంగా ఇచ్చిన అధికారులు సమయం మాత్రం పెంచలేదని, దీంతో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాసేందుకు సమయం సరిపోలేదని కొందరు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్‌ను వివరణ కోరగా సిలబస్‌లో లేని ప్రశ్నలు వచ్చిన మాట నిజమేనని, యూనివర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వేరే ప్రశ్నపత్రాన్ని మెయిల్ ద్వారా తెప్పించుకుని విద్యార్థులకు అందించామని చెప్పారు.

జూన్4న అధికారంలోకి ప్రజా ప్రభుత్వం


మాట్లాడుతూ ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

- ఈసీ అనుమతిలో రైతుల ఖాతాల్లోకి పంట నష్టపరిహారం
- అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధిపై దృష్టి సారిస్తాం
- ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి

మంత్రాలయం : జూన్ 4వ తేదీన మరలా ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వస్తోందని ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి స్పష్టం చేశారు. శనివారం మండలంలోని రాంపురం గ్రామంలో రైతులతో కలిసి ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు ముందు అమలు చేసిన సంక్షేమ పథకాల నిధులు విడుదల కాకుండా టీడీపీ నాయకులు కుట్రలు పన్ని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి అడ్డుపడ్డారన్నారు. టీడీపీ నాయకులు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలంత వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ వైపే ఉన్నారన్నారు. ఎన్నికల ఈసీ అనుమతిలో గత ఏడాది ఖరీఫ్‌లో సకాలంలో వర్షాలు లేక నష్టపోయిన రైతులకు ఎన్నికల కోడ్‌కు ముందే నిధులు విడుదల చేసిందన్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో 57,541 మంది రైతులకు రూ.74.08కోట్లు రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు తెలిపారు. ఇందులో మంత్రాలయం మండలంలో 11,755 మందికి రూ.14.44కోట్లు, పెద్దకడబూరు మండలంలో 15,674 మంది రైతులకు 16.34కోట్లు, కోసిగి మండలంలో 12,230 మంది రైతులకురూ.15.84కోట్లు, కౌతాళం మండలంలో 17,882 మంది రైతులకు రూ.27.45కోట్లు నగదు విడుదలైయిందన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేశారన్నారు. రైతులు నష్టపోకూడదని పంట నష్ట పరిహారం వేసినట్లు తెలిపారు. జూన్ 4న తర్వాత జగనన్న అధికారంలోకి రాగానే అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. అనంతరం తుంగభద్ర గ్రామంలో వెలసిన కన్యాకపరమేశ్వరి జయంతి సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, రైతులు ఉన్నారు.

రేపటి నుంచి సబ్సిడీ విత్తనాలకు రిజిస్ట్రేషన్

ఎమ్మిగనూరురూరల్: ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ విత్తనాలకు రైతు భరోసా కేంద్రాల్లో ఈ నెల 20వ తేదీ నుంచి రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలానికి వేరుశనగ విత్తనాలు 150 క్వింటాళ్లు, నందవరానికి 50 క్వింటాళ్లు, గోనెగండ్లకు 275 క్వింటాళ్లరు, మంత్రాలయానికి 30 క్వింటాళ్లు మంజూరైనట్లు చెప్పారు. క్వింటా ధర రూ.9,500 కాగా రైతు వాటాగా రూ.5,700 చెల్లించాల్సి ఉంటుందన్నారు. వేరుశనగలు కావలసిన రైతులు తమ సమీపంలోని రైతు భరోసా కేంద్రానికి వెళ్లి తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

గోనెగండ్ల: సబ్సిడీ వేరుశనగ విత్తనాల కోసం మండలంలోని రైతులు ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకే కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయ అధికారి హేమలత తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 20వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని చెప్పారు. పట్టదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

పసి ప్రాణాలకు అభయం

- చిన్న పిల్లల వైద్యం కోసం ప్రభుత్వాసుపత్రిలో ప్రత్యేక సౌకర్యాలు
- అందుబాటులో ఆధునిక సౌకర్యాలు, యంత్రాలు


ఫొటోథెరపీ పెట్టిన చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టర్ బాలాజీకుమార్(ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి వివిధ గ్రామాల నుంచి అత్యధిక మంది గర్భిణులు వస్తుంటారు. ఎంతలా అంటే ప్రతి నెల నిర్వహించే సాధారణ పరీక్షలకు ఉదయం ఆరు గంటల నుంచే క్యూ మొదలవుతుంది. కనీసం ఆరు నుంచి ఏడు గంటల పాటు నిరీక్షించి పరీక్షలు చేయించుకుని, మందులు తీసుకెళ్తారు. అలాగే అదే స్థాయిలో కాన్పులు సైతం జరుగుతున్నాయి. దీంతో ప్రభుత్వం ఆసుపత్రిలో పసి పిల్లల వైద్యానికి అవసరమైన ఆధునిక యంత్రాలను సమకూర్చింది. ప్రైవేట్ ఆసుప్రతులకు ధీటుగా సేవలందిస్తుండటంతో ఇక్కడికి కాన్పుల కోసం గర్భిణులు వస్తారు. పిల్లల కోసం అధునిక పరికరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో 10 బేబి ట్రాలీలు ఉన్నాయి. ఇవి అప్పుడే పుట్టిన పసికందుకు వైద్య పరీక్షలు చేయించటానికి, పిల్లల సంరక్షణ కోసం ఉపయోగిస్తాం, 1 ఆక్సీజన రేటర్ ఉంది. ఇది వాతవరణంలోని గాలిని తీసుకొని బేబీకి అందిస్తుంది. 6 వార్మర్ ట్రాలీస్ ఉన్నాయి. వీటిని నెలలు తక్కువ, ఉష్ణోగ్రత తక్కువ ఉన్న పిల్లల కోసం ఉపయోగిస్తారు, 1 పల్స్ ఆక్సీమీటర్ అందుబాటులో ఉంది. దీని ఆధారంగా పుట్టిన బిడ్డకు పల్స్ ఎలా పనిచేస్తుంది, పల్స్ తక్కువ ఉంటే ఎక్కువగా పెట్టడం, ఎక్కువగా ఉంటే తక్కువ చేయడం చేస్తుంది. 6 రిసర్చిటేషన్ బ్యాగ్స్, 3 లెంటిగో స్కోప్ బెడ్ ఉన్నాయి. ఇవి అత్యవసర వైద్య సేవలు అంటే పిల్లలకు ఉపిరి ఆడకపోయినప్పుడు ఉపయోగిస్తారు, ఫోటో థెరపీ మిషన్ ద్వారా జాండిస్ వచ్చిన పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తారు. ఉపిరి ఆడక ఇబ్బంది పడే పిల్లలు, పుట్టిన వెంటనే ఏడ్చని పిల్లలకు చికిత్స చేస్తున్నారు. పుట్టిన పిల్లలు ఏడ్చకపోవటానికి కారణం కాన్పు కష్టంగా ఉన్నప్పుడు ఏడ్వరని..ఇలాంటి పరిస్థితుల్లో బేబీకి ఫిట్స్ వచ్చే అవకాశం కూడా ఉంది. వారికి ముందుగా మెరుగైన చికిత్స అందుబాటులో ఉంది.


పిల్లల పల్స్ ఆక్సీమీటర్

ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి

ప్రభుతాసుపత్రిలో కాన్పులు అయిన పిల్లలకే ఎక్కువగా ఈ వైద్య సేవలు అందిస్తున్నాం. అలాగే గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పసిపిల్లకు కూడా మెరుగైన వైద్యం చేస్తున్నాం. ఇక్కడున్న ఆధునిక యంత్రాలు పట్టణంలోని ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లలో కూడా లేవు. ఈ సౌకర్యలను ప్రజలు సద్వినియోగం చేసకోవాలి.

– డాక్టర్ బాలాజీ కుమార్, సీఎస్ఆర్ఎంఓ, ఎమ్మిగనూరు

21న సర్వసభ్య సమావేశం

కౌతాళం: కౌతాళం మండల సర్వసభ్య సమావేశం ఈనెల 21న మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా తెలపారు. ఎంపీపీ అధ్యక్షన నిర్వహించే సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలన్నారు. అదే విధంగా ఆయా శాఖల అధికారులు పురోగతి నివేదికలతో రావాలని సూచించారు.